# సంసార రాజ్యంలో



క్లాసులోవున్న లెక్చరరు తల పక్కకు తిప్పాడో లేదో శంకరం బయటకు జారుకున్నాడు నిజానికి హిందూలా అంటే శంకరానికి శ్రద్ధ ఎక్కువనే చెప్పాలి. పైగా లెక్చరరు హిందూలా చెబుతూంటే ఇటు తల అటు తిప్పనుగూడా బుద్ధి పుట్టదు. కాని, ఆ రోజు హిందూలా ఆఖరుపీరియడవడంతో కడుపులో దేవుడుగంతు లెయ్యడం మూలాన శంకరం క్లాసులో కూచోలేకపోయాడు. పొద్దున ఎప్పుడో తిన్న సాంబారిడ్లీ జీర్ణమైపోయి చాలా సేపయింది.

గంపెడాకలితో ఇంటికి చేరుకున్నాడు శంకరం. ఇంట్లో ఉన్న నిశ్చల నిశ్శబ్ద వాతావరణం ఒక విధమైన భయాన్నే కలిగించింది. ఏ రోజూగూడా శంకరం ఇల్లు చేరుకునేప్పటికి సందడిలేకుండా వుండేదికాదు. ఆడవాళ్లు బారాలాట్టమో, పద్మ పాటలు పాడటమో, అదీ ఇదీ కాకపోతే అత్తాకోడళ్ల గొడవో, ఏదో ఒక శబ్దం అవుతూనే ఉండేది. లోపలకు వెళ్ళి చూశాడు. పదేళ్ళ పద్మ కుట్టుకుంటూ కూచునుంది. అమ్మగాని శ్రీమతిగాని కనిపించలేదు. పద్మనడిగాడు వదినేదని. పద్మ పడకటిల్లు చూపెట్టింది. మొగం గోడవైపు పెట్టుకొని పడుకొనుంది భార్య కమల నిద్రా? లేక అలకపాన్పా? నిద్రయితే పగలు పాన్పుమీద పవ్వళించదే! "కమలా!" అని పిలిచాడు. జవాబులేదు సరిగదా, శ్రీమతిలో లవలేశమైనా చలనం కలగలేదు. హాల్లోకి వచ్చి 'అమ్మెక్కడ పద్మా?' అని అడిగాడు. పద్మ వంటిల్లు చూపెట్టింది, నోరెత్తకుండానే! వంటింట్లో పైట చెంగు పరుచుకొని తల్లి మంగమ్మ పడుకొనుంది. 'అమ్మా!' అని పిలిచాడు. పలకలేదు. పరిస్థితులర్థంకాక పద్మనడిగాడు. "తగూలాడుకొన్నారన్నయ్యా" అంది పద్మ రహస్యంగానే.

శంకరానికి ఒళ్ళు మండిపోయింది. కడుపులో గలభా చేస్తున్న ఆకలి కోపోద్రేకంగా మారిపోయింది. కమల సంగతి తెలియనిదికాదు. అలకలోవున్న కమల్ని మాట్లాడించేందుకు ప్రయత్నిస్తే, సత్యభామ చేతులో కృష్ణునికయిన పరాభవం జరక్కపోయినా, ఆ అవమానాన్ని అయినా భరించి కృష్ణుడు పొందగలిగిన విజయాన్ని తానీ జన్మలో పొందలేడు. సామ, దాన దండోపాయాలేవీ కూడా ఆసమయంలో పని చెయ్యలేవు. కాలం ఒక్కటే ఆవిణ్ణి శాంత పరుస్తుంది. కొంతసేపయాక ఆవిడంతట ఆవిడే లేవాలి గాని, మరోమార్గమేదీ లేదన్న విషయం శంకరానికి బాగా అనుభవమే!

'అమ్మా!' అని కోపంగా పిలిచాడు. "ఏం నాయనా? నేనిక్కడిక వుండలేన్రా. నీకు పుణ్యముంటుంది రాత్రిబండికే నన్ను తీసుకెళ్ళి అక్కగారింటిదగ్గర దిగబెట్టి రా నాయనా" అన్నది లేస్తూ. "ఇంతకూ అసలు విషయమేమిటో చెప్పవేం?' "నాబొంద! ఏముంది నాయనా. ముసలిదాన్ని నేనెందు కిక్కడ అడ్డం? అక్కడే కృష్ణా రామా అనుకొంటూ పడుంటాను. అత్తల్తోనూ తోడికోడళ్లతోనూ కాపరం చేసాను గాని ఎవరిచేతా ఒక్కమాటని

సి. పి. గుప్తా

పించుకో లేదు. ఈనాటికి ఆ ఖర్మం కూడా పట్టింది." "ఏమన్నదేమిటి?" "ఆ ఏమన్నా అంటారు అలోపవయినప్పుడు. నీకెందుకు నాయనా యీ కీచులాట? ఈ ముసలికోనుగ వున్నంతకాలం నీకూ సుఖం లేదు. రాత్రి బండికి తీసుకెళ్లు నాయనా నీకు పుణ్యముంటుంది" అంటూ లేచి శంకరానికి వడ్డించబోయింది.

శంకరానికిప్పుడు ఆకలి లేదు. ఆకలంతా చచ్చిపోయి, నిరాశా నిస్పృహాలుగా పునర్జన్మ ఎత్తింది. "నాకు అన్నం అవసరం లేదు" అంటూ తనగదిలోకి వెళ్లిపోయాడు. "అన్నయ్యా! అమ్మ వడ్డిస్తుంది రా అన్నయ్యా" అంటూ పద్మ వచ్చింది గదిలోకి. పద్మను కూచోబెట్టి ఏం జరిగిందీ చెప్పమన్నాడు. పద్మ చెప్పింది. "ఏం లేదన్నయ్యా! అమ్మా వదినా నేనూ బారాలాడుతున్నాం. పండబోతున్న వదిన పెద్ద జావ్వాని అమ్మ చంపింది. వదిన పందెం నే చూళ్లేదు మళ్లా ఆడమంది. తప్పాడేందుకు నాకేం ఖర్మ" అంటూ ఆట తీసేసి అమ్మ లేచిపోయింది. అక్కణ్ణుంచి యిద్దరూ మాటమీద మాట అనుకొంటూ పెద్దది చేసుకొన్నారు" అని వెళ్లిపోయింది పద్మ. శంకరానికి నవ్వూ ఏడుపూ రెండూ ఒకేసారి వచ్చాయి. ఎంత స్వల్ప విషయాన్ని కెంత గడబిడ చేసుకొన్నారు!

కమల కాపురానికొచ్చి సంవత్సరం అయినా భార్య మనస్సు అర్థం చేసుకోలేక పోతున్నాడు పట్టభద్రుడైన శంకరం. కమల మనస్తత్వం కాకలుతీరిన మనస్తత్వవేత్తలకుకూడా అంతు చిక్కదు. తను ఎంతంటే అంతే! దానికి మళ్లీ తిరుగుండదు. 'అన్నం అవసరం లేదు' అని అవిడ నోటినుండి వచ్చిందంటే, ప్రపంచం తలకిందులైనా ఆ పూట అన్నం తినదు. మళ్లీ ఒక్కొక్క సమయంలో చాలా అమాయకపు మనిషిలా కనిపిస్తుంది. ఎవరేది చెప్పినా నమ్ముతుంది. 'నీయంతటివాళ్లు లేరం'టే వుబ్బిపోయి చేతనయిన సహాయం చాటుగానయినా చేస్తుంది. మంగమ్మ పేరన్నా మంగమ్మ మాటలన్నా అరికాలిమంట నెత్తి కెక్కుతుంది కమలకు. స్వల్ప విషయాలమీద గొడవలు చేసుకోవడం, గోరంతలు కొండంతలు చేసుకోవడం ఆ యింట్లో పరిపాటైపోయింది. అనేకసార్లు ఇద్దరికీ చెప్పి చూశాడు. తల్లిని సమర్థిస్తున్నావని భార్య, భార్యను వైపేసుకొంటున్నావని తల్లీ ఇద్దరూ తనమీద విరుచుకు పడేవాళ్లు. తగులాడుకొన్నాక అయిదారు రోజులవరకూ ఇద్దరి సందునా పచ్చిగడ్డి భగ్గుమంటుంది. కమల అలిగి పడుకొన్నప్పుడు శంకరం తెలివి తేటలు ఎందుకూ పనికి రావు. మళ్లీ ఆ అలుక ఎంతో సేపుండదు. ఒకటి రెండుగంటలయాక తనకై తనే లేస్తుంది. చెప్పాలో తగ్గదేదీ జరగనట్టుగానే యథాప్రకారంగా ప్రవర్తిస్తుంది.

మంగమ్మ మనస్తత్వం అదోరకం. అవిడ వుద్దేశ్యంలో అత్తకు పర్యాయపదం అధికారం. అత్తకు సపర్య చేయడంకన్నా కోడలు చెయ్యగల పుణ్యకార్య మింకొకటేదీ ఉండదని మంగమ్మ నిశ్చితాభిప్రాయం. మరి అత్తా ఒకింటి కోడలేగదా అంటే తన అత్తకు అవిధంగా సేవ చేసి వెళ్ళబుచ్చింది. కాబట్టే మంగమ్మ తన కోడలినుండి కూడా ఆ విధమైన ప్రవర్తనను డిమాండు చేస్తుంది. శంకరం భార్యను అదుపు ఆజ్ఞల్లో పెట్టుకోలేని దద్దమ్మని ఆమె అభిప్రాయం. మగవాడు మెత్తబడితే అడది నెత్తి కెక్కదూ! భర్త గీచిన గీటు దాటందే భార్యగాని, ఇప్పటి వాళ్ళా? మొగుడు చేసిపెడితే తింటూ కూర్చోవాలనుకునే రకం! మంగమ్మకు కోపం వస్తేచాలు తపోధనులైన మహాత్ములు కూడా కోపం వచ్చి శపించబోయే సమయంలో తమ ఇష్టదేవత ప్రత్యక్షమై 'ఆగు' అంటే ఆగిపోతారు. కాని మంగమ్మకు కోపం వస్తే హరి బ్రహ్మాదులు వచ్చినా అలవాటైన శాపనార్థాలు మంగమ్మ నోటినుండి రాకమానవంటే ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదు. ఎదుటివాళ్లను అర్థం చేసుకోవడం ఆమెకు చేతకాని పని.

తన ఒక సంవత్సరం వివాహజీవితంలో అనేక సార్లు విసుగు జనించింది శంకరానికి. ఒక్కొక్కసారి ఎటైనా పారిపోదామని కూడా అనుకొనేవాడు. ఇంట్లో వుండలేక లేచి బయటకు నడిచాడు. మళ్ళీ ఆకలెయ్యడం మొదలు పెట్టింది. కాఫీ హోటల్లో టిఫిన్ చేసి మాంటురోడ్డు చేరుకున్నాడు. పిక్చరేమయిందీ చూడకుండానే టిక్కెట్టు కొనుక్కొని వెళ్లి సినిమా హాల్లో కూచున్నాడు. భౌతికశరీరం హాల్లో వున్నా,

ఆలోచనలు అన్యథావుంటంచేత సినిమా చూస్తేక పోయాడు. మంగమ్మను తీసుకెళ్ళడమా? మాన డమా? ఇంటికెడితే అమ్మ కూతురింటికి పోతా నని పట్టుపట్టకమానదు. మంగమ్మ నోటివెంట మాట వచ్చిందంటే అది అయేంతవరకూ ఉపోష మైతా ఉంటుంది. తానసలు ఇంటికే వెళ్ళకండా ఏ అరుణాచలమో పోయి నాలుగు దినాలుండి వస్తే! ఇంట్లో పోరు తాత్కాలికంగా సద్దుబాటవు తుందేమోగాని మళ్ళీ వుండేదేగా? ఇంతకూ అసలు తిరిగి రాకుండానే వెళ్ళిపోతే? ఛీ! పద్మగతేం కావాలి? పద్మకు పెళ్ళెవరు చేస్తారు? కమల గతేం కావాలి? అమ్మ మటుకు కోపం మీద అన్నదేకాని, ఎక్కడికి వెళుతుంది? ఎల్లకాలం ఎవరు పెట్టి పోషిస్తారు? అంతులేని ఆలోచనలతో అలసిపోయి కుర్చీలోనే నిద్రపోయాడు.

పొద్దున లేచేంతవరకూ మెలకువ రాలేదు శంకరానికి. హాల్లో నరమానవు డెవడూ లేడు. లేచి గబగబా బయటకు నడిచాడు. మళ్ళీ ఒక సారి కాఫీహోటలు దర్శించి కడుపులో దేవుడికి నైవేద్యంయిచ్చాడు. అప్పుడే రోడ్డుమీద దీపాలు వెలిగించారు. అంతర్థానమవుతున్న ఆ సూర్యుడు ప్రసరించే ఆ సంధ్యాకాంతిలో మెర్క్యురీలైట్లు వెలవెల పోతున్నవి. అవే సూర్యకాంతి పూర్తిగా మాసిపోయి చీకట్లావరించుకున్నా కయితే తమకంటే కాంతివంతమైన దింకేదీ ఈ ప్రపంచంలో లేనట్లే విర్రవీగి పోతవి. శంకరాని కేమీ పాలుపోలేదు. రోడ్డువెంట నడుస్తున్నాడే కాని తన మనస్సంతా ఇంటికి పోవడమా? మానడమా? అన్న ప్రశ్నమీదే లగ్నమైంది.

క్రమంగా సంధ్యారాగం మాయమయ్యేకొలదీ చీకట్లావరించుకోవడం, చీకట్లు ఎక్కువయ్యే కొలదే మెర్క్యురీ లైట్లు మిట్టిపడటం, శంక రాన్ని ఒక్కక్షణం ప్రకృతిని గురించిన ఆలోచ నలోకి దింపింది. బలంగలవాడిముందు బలహీ నుడు తక్కువ పేదల్లే పడుంటాడు. తన కన్న బలహీనుడు కనపడినప్పుడు వొంటికాలిమీద లేస్తాడు; తనకంటే బలవంతుడు మరొకడు లేనట్లే విర్రవీగిపోతాడు- తాత్కాలికంగా అయి నప్పటికీ! వచ్చే పొయ్యే ట్రాములు కార్లు చేస్తున్న గడబిడ శంకరాన్నాకర్షింపలేక పోయింది. మనస్సు అన్యథా లీనమైనపుడు నడు స్తున్నా నడుస్తున్నట్లే కనిపించదు. ఎన్ని మైళ్ళ యినా తెలియకుండానే నడుస్తాము. కాని, అదే మనం నడుస్తున్నామని గుర్తించినప్పుడు, మనస్సును మన స్థితిమీదకు మళ్ళించినప్పుడు అడుగుతీసి అడుగు వెయ్యడం మహాకష్టంగా అనిపిస్తుంది.

ఎన్నడూ నడిచినవాడు కాకపోయినా శంకరం సెంట్రల్ స్టేషన్ వరకూ ఆలోచిస్తూనే నడిచాడు. అక్కడ బస్సు ప్రయాణీకుల కొరకు నిర్మించబడిన సిమెంటు బెంచీమీద కూలబడ్డాడు. పేవుమెంటుమీద వరుసగా ప్రయాణీకులు నుంచొని వున్నారు. శంకరంలో అంతర్యుద్ధం బయలుదేరింది. బొంబాయి మెయిలు ఎక్కడా మనుకొన్నాడు. "ఎందుకూ?" అన్నాడు తన లోని మరో శంకరం.

"అలా వెళ్ళి కొన్నిరోజులు ప్రశాంతంగా గడిపేందుకు."

"అప్పుడు మాత్రం ఈ రగడ వుండదను కొన్నావా?"

"అసలు ఇంటికే రాకుండా పోతే,"—

"ఎక్కడికి?"

"ఎక్కడికో. ప్రపంచంలోకి. సవాలక్ష చోట్లకు."

"పిచ్చివాడా! జీవితానికి భయపడి పరు గెత్తుతావేం?"

"ఈ ఇరకాటకంలో పడి నలిగిపోవడమే నా జీవితం!"

"మరే మనుకొన్నావ్. జీవితం ఎప్పుడూ సాఫీగా నడుస్తుందనుకొన్నావా? ఒడిదుడుకులు జీవితంలో ఎప్పుడూ వుంటవి. ఆ మాత్రానికే భయపడి పారిపోతావా?"

"భయపడి పారిపోవటం కాదు మన శ్శాంతికోసం వెళ్ళటం."

"ఎక్కడుంది మనశ్శాంతి? తల్లినీ భార్యనూ చెల్లెల్ని వదిలి వెళ్ళి ఎన్నాళ్ళు మనశ్శాంతి పొందగలుగుతావు? జీవితంలో ప్రత్యక్షమయ్యే నగ్నసత్యాలివే కావు. ఇంతకన్నా ఘోరమైనవి బోలెడున్నవి. వెర్రిపోకళ్లు పోకుండా ఇంటిదారి పట్టు."

శంకరం భారంగా లేచి ఇంటిదారి పట్టాడు. వంచిన తల ఎత్తకుండా తానింటికి చేరుకోగానే

జరిగే పరిణామాల్ని గురించి ఆలోచిస్తూ నడుస్తున్నాడు. అమ్మ తీసుకెళ్ళమని పట్టుపట్టుతుంది. కమల నే నొక్కదాన్నీ వుండలేనంటుంది. మళ్ళీ అత్తా కోడళ్ళిద్దరూ వాగ్యుద్ధరంగంలో కురుకుతారు-తన వునికిగూడా గమనించరు.

శంకరం కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరుకునేసరికి ఏడూ ముప్పావు అయింది. ఇంట్లో అడుగు పెట్టడంతోనే తాను కల్లోనైనా ఊహించని దృశ్యం చూచేప్పటికి మెర్క్యురీ లైట్లకన్నా మెరుగ్గా వెలిగిపోయినవి శంకరం రెండుకళ్ళూ. మంగమ్మా కమలా పద్మా ముగ్గురూ హాల్లో ఒకే చాపమీద కూచునివున్నారు. తన్ను చూడటంతోనే కమల లేచి వంటింట్లో కెళ్ళిపోయింది. మంగమ్మ లేచి "ఎక్కడికెళ్ళావురా నాయనా? పొద్దుట్నుండీ అన్నం లేకుండా ఎక్కడెక్కడ తిరిగావో! మొగంచూడు ఎలా వాడిపోయిందో" అంటూ ఎదురుగా వచ్చింది. "నువ్వు తినకుండా పోయావని అమ్మ వదినా అన్నం మానేశారన్నయ్యా" పద్మ అందుకుంది. వంటింటి ద్వారందగ్గర ముడి కట్టుకొని సాక్షాత్కరించింది కమల. శంకరానికి అంతా అయోమయంగా వుంది. దారి పొడుగునా తన్ను భయపెట్టిన ఊహా చిత్రాలు మాయమయాయి. "అత్తయ్యా! నీళ్ళు పెట్టాను కొడుకును స్నానం చెయ్యమనండి" అన్నది కమల. తన చెవుల్ని తాను నమ్మేస్థితిలో లేడు శంకరం. గోడ గడియారం తన్నుచూచి నవ్వినట్లు గంటలు కొట్టింది. "పిచ్చివాడా! పారిపోతావేం?" అన్నాడు మరో శంకరం. "స్నానంచేసి రా అన్నయ్యా, నీకో మంచిమాట చెబుతాను" అంది పద్మ.

శంకరం స్నానం ముగించేలోపల కమల మూడు విస్తళ్ళేసి వడ్డించింది, తనకు, మంగమ్మకు, పద్మకు. భోజనంముగించేసివెళ్ళి తనగదిలోకూచుని యీ అనుకోని పరిణామాలకు కారణాలూహించుకుంటున్నాడు శంకరం. "జోజో నందబాలా! జోజో గోపీలోలా!" పాడుకుంటూ గంతులు వేసుకుంటూ ప్రవేశించింది పద్మ. "ఏమిటి పద్మా ఆ గంతులు? ఎందుకంత సంతోషం? ఇలారా" అంటూ దగ్గర కూచోబెట్టుకున్నాడు. పద్మ కూచుంటూ "పుడ్తాడులే అన్నయ్యా" అంటూ నవ్వడం మొదలెట్టింది. శంకరానికి పద్మ ఆనందం చూస్తుంటే నవ్వాగిందేకాదు. "ఎవరు పద్మా పుట్టేది?" అన్నాడు నవ్వుతూ. "అల్లుడూ!" దీర్ఘం తీసింది చెల్లెలు. "అల్లుడా! నీకు పెళ్ళే కాలేదుగా?" అన్నాడు తల నిమురుతూ. "నీకు కాదన్నయ్యా. నాకు అల్లుడు పుడ్తాడు" "అయితే సరేగాని నే వెళ్ళాక ఏం జరిగిందేమిటి? అమ్మా వదినా మాట్లాడుకొంటున్నారేం?" ప్రశ్నించాడు ఆరా తీసే పత్తేదారుకుమల్లే.

"నువ్వు అన్నం తినకుండాపోయావని అమ్మ చాలా నొచ్చుకుం దన్నయ్యా! నా నోరు పడిపోనూ, ఇంటికొచ్చిన బిడ్డకు తిండి పెట్టకుండా పంపాను. కడుపు మండిపోనూ అంటూ పెద్దగా తిట్టుకుంది. వదినకు డోకొచ్చింది కాబోలు లేచి బయటకివచ్చి బొగళిబొగళి కక్కింది. అమ్మ లేచిపోయి చెవులు మూసింది. వదిన చెప్పింది: అయిదారు రోజులబట్టి అన్నం సహించడం లేదట. "వేవిళ్ళేమోనే తల్లీ" అంది అమ్మ. వదినను అన్నం తినమని ఎంత బతిమాలినా నువ్వురానిదీ తిన నన్నది. అమ్మా భోంచెయ్యలేదు. అప్పట్నుండి నీకోసం చూస్తూ కూచున్నాం" అంటూ ముగించింది, ఇన్ఫర్మేషన్ బ్యూరో పద్మ. భార్య గర్భిణితో ఉన్నదని తెలిశాక సంతోషం పట్టలేకపోయాడు శంకరం. "వారే శంకరం! దాని కయిదారు రోజులబట్టి అన్నమే సహించడం లేదట్రా. ఇందాక వెళ్ళబోసుకొంది" అంటోంది మంగమ్మ హాల్లోంచి. "అయితే అమ్మా నువ్వు అక్కగారింటికి వెళ్ళడం ఏమైంది?" అని అడిగాడు శంకరం నవ్వుతూనే. "ఆఁ నాబొంద, ఏదో కోపంమీద అన్నాగాని నే నెక్కడికి కెడతాన్రా. నీకడుపున ఓనలుసు పుడితే చూసి ఆనందంతో చావాలనుంది నాయనా" అంటూ దీర్ఘాలు తియ్యడంతో శంకరం మనస్సు దూదికన్నా తేలికైపోయింది.